క్లుప్తంగా

పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీషా

చిన్నమండెం : మండల పరిధిలోని పెద్దారెడ్డివారిపల్లెకు చెందిన జగ్గల క్రిష్ణయ్య అనే పింఛన్‌దారుడుకి కాలు బెనికడంతో మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మహిళా వలంటీర్ డి.శిరీషా మదనపల్లెకు వెళ్లి చికిత్స పొందుతున్న కృష్ణయ్య వద్ద వేలిముద్రలు తీసుకొని పింఛన్ నగదును అందజేసింది. దీంతో బాధితుడి బంధువులు వలంటీర్‌ను మెచ్చుకున్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు



స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ హసితనాయక్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను ఆదివారం నూతనంగా ఎంపికైన టీటీడీ బోర్డు మెంబర్ హసిత నాయక్, కడప మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ వేర్వేరు సమయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి ఆలయ ప్రదక్షణలు గావించి, గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పాదయాత్ర బృందానికి అన్నప్రసాదాలు పంపిణీ

నందలూరు (రాజంపేట) : సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువు నుంచి సీసాల రాజు ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర చేపట్టిన శ్రీ వేంకటేశ్వర భక్తి బృందానికి ఆదివారం చెయ్యేటి ఒడ్డున అన్నప్రసాదాలను జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి పంపిణీ చేశారు. నందలూరు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కామాక్షయ్య ఆధ్వర్యంలో శ్రీవారి భక్తులకు స్వాగతం పలికారు. జెడ్పీటీసీ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో స్థానికులు ఆనాల అప్పయ్య, బయనబోయిన నరసింహులుతోపాటు భక్తులు పాల్గొన్నారు. తమ అన్నప్రసాదాలు ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ గడికోట, కామాక్షయ్యలను పాదయాత్ర బృందం ఘనంగా సన్మానించారు.

నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడిగా మౌలా



రాయచోటి అర్బన్ : పట్టణంలోని మాసాపేటకు చెందిన పాలగిరి మౌలా రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎస్.బాజీ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మౌలా మాట్లాడుతూ తనపై నమ్మకంతో సంఘం జిల్లా అధ్యక్షుడుగా నియమించిన ఎస్.ఎస్.బాజీతో పాటు ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మౌలా నియామకం పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పంచముఖ అభయాంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడి

పీలేరు రూరల్ : ఆకుకూరలు, కూరగాయల సాగులో ఘన జీవామృతం వాడకం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చునని ఫార్మర్ శాస్త్రవేత్త వై. శకుంతల అన్నారు. ఆదివారం మండలలలోని బోడుమల్లువారిపల్లె వీవో నెంబరు-1 పరిధిలోని మొరవపల్లె గాయత్రి ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌జీ సిబ్బంది లక్ష్మీ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

అర్హతే ఆధారం.. ప్రజల చెంతకే సంక్షేమం

- పేదల బాగోగుల కోసం సీఎం జగన్ అహర్నిశలు కృషి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



వృద్ధురాలికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లె : రామరాజ్యంలా జగన్ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం పాలెంగొల్లపల్లెలో ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలెంగొల్లపల్లి గ్రామంలో మామిరెడ్డిగారిపల్లె, పాలెం హరిజనవాడ, బురుజుపల్లె, ఎగువపల్లె, నడింపల్లె, చిన్నపోతులపల్లె, పాలెంగొల్లపల్లెలలో శ్రీకాంత్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలపై ఆరా తీస్తూ కొనసాగిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లల్లో సువర్ణ ఘట్టాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారన్నారు. అర్హతే ఆధారంగా ప్రజల చెంతకే సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందిస్తున్నారన్నారు.

ఏకీల కులస్తులను బీసీలో చేర్చిన ఘనత వైఎస్సార్‌దే

ఏకీల కులస్తులను బీసీలో చేర్చిన ఘనత వైఎస్సార్‌దే అని పాలెం గొల్లపల్లె గ్రామంలోని ఏకీల కుటుంబాలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుట స్పష్టం చేశారు. వైఎస్సార్ తమను ఓసీ నుంచి బీసీలలోకి మార్చడంతోనే రిజర్వేషన్లు వర్తించి విద్య, ఉద్యోగాలు వస్తున్నాయని, వైఎస్సార్ మేలు మరువలేమంటూ జగనన్న వెంటే నడుస్తామంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి సంతోషంగా తెలిపారు.

దళితోద్ధారకుడు సీఎం జగన్

పాలెం హరిజనవాడలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి ఇంటింటా అపూర్వ స్వాగతాలు లభించాయి. జగనన్న పాలనలో తమకు నేరుగా ఎవరి సిఫార్సు లేకుండానే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దళితుల సంక్షేమం, అభివృద్ధికి జగనన్న చిత్తశుద్ధితో కృషిచేస్తూ దళితోద్ధారకుడుగా పేరొందారంటూ హరిజనవాడ వాసులు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు దళితుల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడి తమను అవమానించారని వారు గుర్తు చేశారు. తామెప్పుడూ జగనన్న వెంటే నడుస్తామని ఈ సందర్భంగా హరిజనవాడ వాసులు శ్రీకాంత్ రెడ్డికి స్పష్టం చేశారు. కార్యక్రమం జరిగిన అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు తమకు సంక్షేమ పథకాలు అందాయని, కొందరికి 3–5 పథకాలు అందడంతో వారి సంతోషాన్ని ఎమ్మెల్యే ఎదుట వెలిబుచ్చారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నపు విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, సిద్దిక నాగిరెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీలు లక్ష్మినారాయణ, శంకర్ నాయుడు, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, కొండా ప్రసాద్ రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్‌లు నాగముని, మల్ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్ రెడ్డి, జగన్నాథ నాయుడు, మల్లేష్ నాయుడు, మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రైతుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాలెం గొల్లపల్లెలో జరిగిన ప్రధాన మంత్రి కృషి సాంచాయి యోజన డబ్ల్యూడీసీపీఎం కెఎస్‌వై 2.0 జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉత్పాదక పెంపుదల నిధులతో మంజూరైన లక్కిరెడ్డిపల్లె మండలంలోని పాలెం గొల్లపల్లె వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండలం పాలెం గొల్లపల్లె వాటర్ షెడ్ పరిధిలోని 160 మంది రైతులకు రూ. 28 లక్షలు విలువగల వ్యవసాయ పరికరాలను మంజూరయ్యాయన్నారు. వాటర్ షెడ్ ప్రాజెక్టుల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీ, ఓసీ, బీసీ రైతులకు 80శాతం సబ్సిడీతో రైతులకు యంత్ర పరికరాలను అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలను వాటర్ షెడ్ పరిధిలోకి చేర్చాలని డ్వామా పీడీ మద్దిలేటి వాటర్ షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్య, పీఓ అశోక్ రెడ్డిలకు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. పాలెం గొల్లపల్లెలో వాటర్ షెడ్ పరిధిలో రూ. 1,27,800లు వ్యయంతో సబ్‌మెర్సీబుల్ పంపు సెట్‌ను శ్రీకాంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు.

ప్రతి చెరువుకు వెలిగల్లు నీరు చేరేలా చర్యలు

వెలిగల్లు కాలువ పరిధిలో ఉన్న గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని ప్రతి చెరువుకు వెలిగల్లు నీటిని నింపి సాగునీరు అందించడానికి అధికారులను ఆదేశించినట్లు అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కోనంపేట సమీపంలోని దొర్రిచెరువు వద్ద స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డిలతో కలిసి వెలిగల్లు కాలువలో పారుతున్న నీటిని ఎమ్మెల్యే పరిశీలించారు. కాలువలో అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు. వెలుగల్లు నీరు చెరువులకు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

వ్యాధిగ్రస్తుడికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని ఓబిలి పంచాయతీ అత్తిగారిపల్లి దళితవాడకు చెందిన చౌడవరం నరసింహులు అనే వ్యాధిగ్రస్తుడికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు రూ. 30 వేలు వితరణగా నాగభూషణం ద్వారా ఆదివారం అందించారు. వివరాల్లోకి వెళ్తే ఇటీవల ఓబిలి పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వ్యాధిగ్రస్తుడు నరసింహులు ఇంటివద్దకు వెళ్లగానే అనారోగ్యం ఎక్కువకావడంతో బెంగుళూరులో వైద్య పరీక్షలు చేసుకునేందుకు తమకు ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యేను కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం రూ. 30 వేలు నగదును నరసింహులు కుటుంబానికి అందించారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్ కొరముట్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమిని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అనపగుట్టలో వెలసిన గోవర్థగిరిలో వెలిసిన శ్రీ కృష్ణా ఆలయంలో ఈనెల 7న నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమిని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. రాయలసీమలోనే అతిపెద్ద శ్రీకృష్ణ ఆలయంలో పలు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పిస్తాం



ఓటరు జాబితా ప్రక్రియపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేక అధికారి నాగరాజు

పెనగలూరు : మండలంలో చనిపోయిన వారి ఓట్ల తొలగింపులో భాగంగా ఆదివారం మండల ప్రత్యేక అధికారి నాగరాజు ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. మండలంలో రద్దు చేసిన ఓట్లు 720 ఉన్నాయని, గ్రామాల వారీగా ప్రతి కుటుంబానికి వెళ్లి రద్దుచేసిన ఓటర్లను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. ఆదివారం కొత్తపల్లి, పెనగలూరు, ఇండ్లూరు, ఎస్ఆర్ పురం, నారాయణ నెల్లూరు సచివాలయ పరిధిలో ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో ఆయన మాట్లాడుతూ రద్దు చేసిన ఓటర్ల జాబితా ముఖ్యంగా మరణించిన, షిఫ్టింగ్, రిపీట్ ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నామన్నారు. చనిపోయిన ఓటర్ల జాబితాలో బీఎల్ఓలు చనిపోకపోయినా చనిపోయినట్లు పొరపాటున రాస్తే అటువంటి వారి జాబితాను పరిశీలించి అటువంటి వారికి ఓటు హక్కు కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వ, ఎన్నికల సంఘం ఉద్దేశమన్నారు. అందుకే రద్దు చేసిన ఓటర్ల జాబితాపై తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర దేశాలలో ఉన్నా, ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాలలో ఉన్న వారి ఓటు హక్కు తీసివేయకూడదన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలపై పనిభారాన్ని తగ్గించండి



మాట్లాడుతున్న లీలావతమ్మ

రాయచోటి అర్బన్ : సచివాలయాల హెల్త్ సెక్రటరీలపై పనిభారాన్ని తగ్గించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు ఆన్‌లైన్ యాప్‌ల నిర్వహణ భారాన్ని తగ్గించడంతో పాటు వారిని గ్రేడ్ – 3 నుంచి ఎంపీహెచ్ఏ (ఎఫ్)గా మార్చాలంటూ కోరారు. బయోమెట్రిక్ హాజరుకు మినహాయింపు ఇవ్వాలన్నారు.

నూతన కమిటీ ఎంపిక

ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా పి.ఎల్.నరసింహులు, అధ్యక్షురాలిగా కె.యల్లమ్మ, ఉపాధ్యక్షులుగా హైమావతి, శ్రీవిద్య, షాహీదాబేగం, ప్రధాన కార్యదర్శిగా ఎం. ఉషారాణిలు ఎంపికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డికళ, సహాయ కార్యదర్శులుగా ఎం.రెడ్డెమ్మ, సి.రాణెమ్మ, సురేఖ, కోశాధికారిగా ఎం.శంకరమ్మ, కమిటీ సభ్యులుగా రమాదేవి, జమున, సీతామహాలక్ష్మి, భాను, గీత, ఉమ, ధనమ్మ, రామక్రిష్ణమ్మ, అరుణలు ఎంపికయ్యారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేయండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ డీఐ) పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయూబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహమ్మద్ అలీలు డిమాండ్ చేశారు. ఆదివారం రూటా కార్యాలయంలో ముఖ్య సంఘం నేతల సమావేశంలో వారు మాట్లాడారు. వందల సంఖ్యలో ఎంఈఓ పోస్టులను భర్తీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉర్దూ డీఐ పోస్టుల భర్తీని విస్మరించడం శోచనీయమన్నారు. రాష్ట్ర రెండవ అధికార భాష అయిన ఉర్దూకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలంటూ కోరారు. రాష్ట్రంలోని పాత జిల్లాలతోపాటు నూతనంగా ఏర్పడిన జిల్లాలోనూ ఖాళీగా ఉన్న ఉర్దూ డీఐ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పలుజిల్లాలో ఉర్దూ పాఠశాలలు అత్యధిక సంఖ్యలో ఉన్న కారణంగా ఉర్దూ డీఐ పోస్టులు అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రూటా నేతలు సిబాతుర్ రహిమాన్, అసదుల్లా, జాఫరుద్దీన్, హుమయుద్దీన్, ముహిబుల్లా, అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణతో జిల్లాకు మంచిపేరు తేవాలి



మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

కురబలకోట: సమగ్ర శిక్షణ పొందిన గ్రామ కార్యదర్శులు జిల్లాకు మంచి పేరు తేవాలని, తద్వారా గ్రామాల్లో ప్రగతి శీలకారకులు కావాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆరు రోజులుగా అంగళ్లు గోల్డెన్ వ్యాలీ కళాశాలలో జిల్లా స్థాయిలో 112 మంది గ్రామ కార్యదర్శులకు జరిగిన మొదటి బ్యాచ్ రెసిడెన్సియల్ శిక్షణ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ దేశంలోనే తొలి వ్యవస్థ అని అన్నారు. గ్రామాలు బాగుంటే దేశం బాగుంటుందని గాంధీజీ ఏనాడో చెప్పాడన్నారు. పంచాయతీలకు సంబంధించి అన్ని విషయాలపై సమగ్ర శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు గుర్తించేలా విధి నిర్వహణలో కొత్త కార్యదర్శులుగా కొత్తదనం కన్పించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో గ్రామ వికాసానికి పాటుపడుతూ ముందుకు సాగాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు మాట్లాడుతూ నేర్చుకున్న వాటిపై పనితీరు మెరుగుపరచుకుని గ్రామాల్లో మంచి పేరు, గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. మరో ప్రాంతానికి బదిలీ అయినా ఇతనే మాకు కావాలి అన్నంతగా ప్రజల నుంచి స్పందన వచ్చేలా మెరుగైన సేవలు ఉండాలన్నారు. ప్రజలతో కలసి మెలసి నడచుకుంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే ఇలాంటివి సాధ్యమవుతాయన్నారు. శిక్షణ ముందు తర్వాత అన్న విధంగా పనితనంలో తేడా కన్పించాలన్నారు. శిక్షణ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం కల్గుతుందన్నారు. నిజాయితీ, నిబద్ధత, సమగ్ర నైపుణ్యం, సేవాదృక్పథంతో పనిచేసి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సాంకేతికంగా కూడా నిపుణత సాధించాలన్నారు. గోల్డ్ స్వ్యాలీ కళాశాల అధినేత ఎన్వీ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై కార్యదర్శులకు అవగాహన ఉండాలన్నారు. వివిధ శాఖలను సమన్వయ పరచుకుంటూ పది కాలాల పాటు గుర్తుండేలా ప్రజలకు సేవలందించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఎస్. అబ్దుల్ సుకూర్, ఎస్. నవాజ్, కె. శేషగిరికుమార్, బి. రాజశేఖర్ నాయక్, ఎస్. గఫూర్, ఎస్. గిరిధర్, పద్మారాణి, రెడ్డెప్ప, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన గ్రామ కార్యదర్శులకు డీపీఓ, డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపు, కుంకుమలు, కర్పూర హరతులతో పూజలు నిర్వహించారు.

కేశాలు దానం చేసిన విద్యార్థిని

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల కోసం హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, విమల దంపతుల కుమార్తె విష్ణుప్రియ తన పుట్టినరోజున హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు చాను, రెడ్డి,అమీన్, కిరణ్‌లు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా ప్రభుచరణ్

వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా వాల్మీకిపురానికి చెందిన ప్రభుచరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం రాయచోటిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా వాల్మీకిపురంకు చెందిన ప్రభుచరణ్, ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన ప్రకాష్ రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో ముగ్గురు గౌరవ అధ్యక్షులు, కోశాధికారి, ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులు నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను పారద్రోలి ప్రజల్లో సైన్సుపై అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక అంశాలపై నిరంతరంగా కృషి చేస్తోందన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

కడప అగ్రికల్చర్ : నిన్న మొన్నటి వరకు కొండెక్కి కూర్చున్న కూరగాయల ధరలు కొండదిగొచ్చాయ్. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొద్ది రోజుల నుంచి అందరి నోటా నలిగిన టమాట ధర ఒక్కసారిగా తగ్గింది. కిలో టమాట ధర ప్రస్తుతం రూ. 20కు వచ్చింది. గతంలో రూ. 250 ఉన్న అల్లం ధర నేడు రూ.120 కు చేరింది. కాప్సికమ్, బీన్స్ ధరలు మాత్రం కిలో రూ.60 ఉండగా, బంగాళదుంప, కాలీఫ్లవర్, అలసందలు, అనపకాయలు, ముల్లంగి, బీట్రూట్ మాత్రం కిలో రూ. 40 ఉంది. క్యారెట్ కిలో రూ.36 ఉండగా చిక్కుడుకాయలు, మిరపకాయలు కిలో రూ. 35, దొండకాయలు, క్యాబేజీ, దోసకాయలు కిలో రూ.30, బీరకాయ కిలో రూ. 25, మట్టిక్కాయ, వంకాయ, కాకరకాయలు కిలో రూ. 20, బెండకాయ కిలో రూ. 15 ఉన్నాయి.

వరాల తల్లి ఆరోగ్యమాత

కడప కల్చరల్ : మరియ తల్లి తనను అడిగిన వారందరికీ అభయహస్తం అందిస్తూ వరాల తల్లిగా కడపలో కొలువై ఉన్నారని, అందరూ ఆ తల్లిని దర్శించి కలలను సాకారం చేసుకోవాలని చిత్తూరు మల్టీ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్, రెవరండ్ ఫాదర్ గడికోట మనోహర్ తెలిపారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత చర్చి నవదిన ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఫాదర్ సూసైనాదన్ మైఖేల్ దివ్యబలి పూజను సమర్పించగా, మనోహర్ దివ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫాదర్‌మైఖేల్ మాట్లాడుతూ మన ఆశలకు స్పందించి అడగకముందే వరాలిచ్చే తల్లి మన సమీపంలోనే ఉందని, ఆమెను దర్శించి ఆమె దివ్య సన్నిధిలో తరించాలని సూచించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వర్గీకరణకు ప్రతి ఒక్కరూ కష్టపడాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీస్, ఎంఈఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : ఎస్సీ వర్గీకరణకై అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ బండకింద మనోహర్, ఎంఈఎఫ్ జిల్లా కన్వీనర్ హరిబాబులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీస్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తేదీ నుంచి 22వ తేదీ పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. 4వ తేదీన జిల్లా కేంద్రంలోని అన్నిపార్టీల నేతలతో కలసి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించే విధంగా సహాయ, సహకారాలు కోరతామన్నారు. 5, 6 తేదీలలో జిల్లా కేంద్రంలోని అన్ని కులసంఘాల నేతలను కలసి వర్గీకరణకు మద్దతు కోరనున్నట్లు తెలిపారు. 7వతేదీన అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, కులసంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. 8వతేదీన జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలను ప్రారంభించి 22వతేదీన పార్లమెంటు సమావేశాలు ముగిసేవరకు కొనసాగించనున్నామన్నారు. 10వ తేదీన మండల కేంద్రాల్లో దీక్షలు ప్రారంభం చేయాలన్నారు. కార్య క్రమం విజయవంతానికి రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలంటూ పిలుపునిచ్చారు. ప్రాణాలైనా అర్పిద్దాం – వర్గీకరణను సాధిద్దాం అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్, ఎంఈఎఫ్ నేతలు దేవరాజు, వంగిమళ్ళ రమణయ్య, ప్రేమకుమార్, గురుప్రసాద్, కలకడ శ్రీనివాసులు, తిరుపాల్‌తోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నేతలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సీహెచ్‌ఎస్ కృషి



పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలతో సీహెచ్‌ఎస్ సభ్యులు

చిట్వేలి : పర్యావరణ పరిరక్షణలో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ (సీహెచ్‌ఎస్) ముమ్మరంగా కృషి చేస్తుందని సీహెచ్‌ఎస్ సభ్యులు తెలిపారు. 2016 నుంచి విశిష్ట రంగాలలో సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలిచింది. 2019లో గ్రీన్ చిట్వేలి నినాదంతో మొక్కలను నాటడం, వాటిని సంరక్షిస్తూ ఇప్పటికే 3 వేల మొక్కలను యువత కోరిక మేరకు వివిధ గ్రామ పరిసరాలలో నాటారు. ఈ సందర్భంగా ఆదివారం సీహెచ్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ చిట్వేలి ప్రజలకు మొక్కలు అందుబాటులో ఉంచేందుకు రాజంపేట బయోడైవర్సిటీ నర్సరీ నుంచి వేప, ఉసిరి, నేరేడు తదితర మొక్కలను తెచ్చి స్థానిక అటవీశాఖ కార్యాలయంలో నిల్వ ఉంచామన్నారు. మొక్కలు నాటాలనుకున్న వారు తమను సంప్రదించి తీసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చిట్వేలిలో నర్సరీని పునరుద్ధరించాలని సీహెచ్‌ఎస్ సభ్యులు కోరారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించండి

రాయచోటి అర్బన్ : జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించడంతోపాటు నూతన పరిశ్రమలను నెలకొల్పి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండుకోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీయిచ్చి నెరవేర్చడంలో ఘోరవైఫల్యం చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కీములలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలను అమలు చేయాలన్నారు. సెప్టెంబరు 6న రాయచోటిలో, 7న మదనపల్లెలో జరిగే సీపీఐ బస్సుయాత్ర, బహిరంగసభలకు ఏఐటీయూసీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కో–కన్వీనర్ సరోజనమ్మ, ఆఫీస్ బేరర్స్ సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, కార్యదర్శి పుల్లయ్య, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

గో మహాలక్ష్మికి సీమంతం

మదనపల్లె : భారతీయ సంస్కృతిలో ఆవుకు విశిష్ట స్థానం ఉంది. గోవులను శుభానికి సూచికగా, శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా భావిస్తాం. ఆవు ఉన్న ఇంట ఆనందం, ఆరోగ్యం ఉంటాయనేది నానుడి. గతంలో పాడి, పంటకు సమ ప్రాధాన్యత ఉండేది. రైతు ఇంట్లో గోమాతలు కుటుంబసభ్యులుగా కలియతిరిగేవి. ఆనాటి రోజులు మళ్లీ రావాలని, ఆవుల సంరక్షణ, ప్రాధాన్యత అందరికీ తెలియాలని కాంక్షిస్తూ అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం ఇసుకనూతిపల్లెకు చెందిన ఉమాదేవి అంగరంగ వైభవంగా ఆవుకు ఆదివారం సీమంతం చేశారు. బంధుమిత్రులు, చుట్టుపక్కల అతిథులను ఆహ్వానించారు. పండ్లు, పూలు సమర్పించి పూజలు చేశారు. గోవుల పట్ల అందరికీ ప్రేమ ఉండాలని, సంప్రదాయం ప్రకారం వేడుక నిర్వహించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఆ వివరాలిలా.. మదనపల్లె మండలం ఇసుకనూతిపల్లెకు చెందిన వెంకటరమణ, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. 20 ఏళ్ల కిందట భర్త వెంకటరమణ అనారోగ్యంతో చనిపోయాడు. ఇంటి యజమాని చనిపోవడంతో ఇద్దరు ఆడబిడ్డలను పోషించేందుకు ఉమాదేవి కష్టాలు పడింది. ఆమె బాధలను గమనించిన ఓ సమీప బంధువు కుటుంబపోషణకు ఆధారంగా ఉంటుందని ఉమాదేవికి అప్పుగా ఓ పాడి ఆవును పట్టించాడు. ఆ ఆవును పెంచుకుంటూ, దాని నుంచి వచ్చిన పాలను అమ్ముకుంటూ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో ఆ ఆవు ఓ పెయ్యదూడకు జన్మనిచ్చి చనిపోయింది. తమ ఇంట పుట్టిన దూడను ఉమాదేవి అల్లారుముద్దుగా, కన్నబిడ్డలతో సమానంగా ఉమాదేవి చూసుకునేది. దూడ పెద్దదై మొదటి ఈతలో రోజుకు 13లీటర్ల వరకు పాలు ఇచ్చేది. ఈ పాలను అమ్ముకుంటూ వచ్చిన ఆదాయంతో మరో నాలుగు ఆవులను కొనుగోలు చేసిన ఉమాదేవి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి సొంతంగా ఇల్లు కట్టుకుంది. తన, కుటుంబ ఎదుగుదలకు మహాలక్ష్మిలా, తన ఇంట సిరులు కురిపించి పెద్దదిక్కుగా మారిన ఆవు లక్ష్మి రెండోసారి గర్భం దాల్చింది. దీంతో ఉమాదేవి ఐదునెలల గర్భిణి అయిన లక్ష్మికి వైభవంగా సీమంతం చేసింది. మంగళహారతులు పాడుతూ..వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా సీమంతం కార్యక్రమం నిర్వహించింది. ముత్తైదువలతో పాటు వచ్చిన బంధువులకు, చిన్నపిల్లలకు ఉమాదేవి విందు భోజనం వడ్డించింది.